ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 24 | సంచిక : 05 | జనవరి 2019

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 20

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 12/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
9441122622
7780639977

ఈ సంచికలో....

09-09-1984
జిన్నూరు

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 09-09-1984, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

బజారులో సరుకులు ఉన్నాయి, కళ్ళకి కనిపిస్తున్నాయి, అయితే నాకు కొనుక్కునే శక్తి లేదు అంటే నా దగ్గర డబ్బు లేదు కాబట్టి ఆ వస్తువు నాకు రాదు. అందుచేత నన్ను అందరూ బీదవాడు అంటున్నారు. సరుకులు బజారులో ఉన్నప్పటికీ ఆ సరుకులని ఎవడైతే కొనుక్కోలేడో వాడు బీదవాడు. బజారులో సరుకులు ఎలా ఉన్నాయో, అదేవిధంగా పుస్తకాలలో జ్ఞానం ఉంది. మీరు భగవద్గీత చదివినా, ఉపనిషత్తులు చదివినా, భగవాన్ పుస్తకాలు, రామకృష్ణుడి పుస్తకాలు చదివినా, ఆ పుస్తకాలలో ఉన్నదంతా జ్ఞానమే. అయితే నాకు అర్థం చేసుకునే శక్తి లేనప్పుడు నేను అజ్ఞానిగానే మిగిలిపోతాను. బజారులో దొరికే వస్తువు కొనుక్కోలేనప్పుడు నేను బీదవాడిగా ఎలా ఉండిపోతున్నానో, అలా పుస్తకాలలో ఎంతజ్ఞానం ఉన్నప్పటికీ, దానిని అర్థం చేసుకునే శక్తి కానీ, వివేకం కానీ నాకు లేనప్పుడు నేను అజ్ఞానిగానే ఉండిపోతాను. అది అర్థం చేసుకుంటే, విజ్ఞానం వస్తుంది, సుజ్ఞానం వస్తుంది. అర్థం చేసుకోలేకపోతే వాడు ఎప్పుడూ అజ్ఞానిగానే జీవితంలో ఉండిపోతాడు. నిన్న డాక్టరుగారి కూడా పందలపాక వెళ్ళినప్పుడు అక్కడ అనేకమంది అనేక ప్రశ్నలు అడిగారు కానీ ఆత్మపరంగా, దైవపరంగా అడిగినవాళ్ళు ఒక్కరూ లేరు. లౌకికంగా వాళ్ళు అడిగిన ప్రశ్నలకుమటుకు నేను సమాధానాలు చెప్పాను, చెప్పినప్పటికీ వాళ్ళలో దైవీపరంగా ఆత్మపరంగా ఒక్క ప్రశ్న రాలేదు ముచ్చటకైనా! వాళ్ళకి ఏది కావాలో వాళ్ళకి తెలియదు.

మిమ్మల్ని వేధించకుండా, బాధించకుండా స్వరూపాన్ని మీ ముందు ఉంచాలని నా తపన. చెప్పేవాడు వినేవాడికి అర్థం అయ్యేటట్టు చెప్పగలిగితే, అది చెప్పటానికి వాడికి అర్హత ఉన్నట్లు. విషయం నాకు ఎంత తెలుసును అనేది ఇక్కడ సమస్య కాదు. నేను మిమ్మల్ని ఎంతవరకు ముందుకు తీసుకురాగలుగుతున్నాను, ఎంతవరకు మీకు అర్థం అయ్యేటట్టు చెప్పగలుగుతున్నాను అనేది సమస్య. అసలు మనిషి ప్రతివాడూ తన అహంకారం తాను అనుకుంటాడు. నేను నేను అనుకొన్నప్పుడు, నా అహంకారం నేను అనుకొంటున్నాను. అది అబద్ధం. అలా అనుకోవచ్చు కానీ అనుకోవటం వేరు, నిజం వేరు. మీరు అనుకొన్నంత మాత్రంచేత ఒక అబద్ధం నిజం అవ్వదు. కానీ మీరు అనుకోవచ్చు. భగవంతుడు నేను ఆత్మని అని చెప్పాడా? అహంకారం అని చెప్పాడా? నేను ఆత్మని అని చెప్పాడు. అయితే నేను ఏమనుకొంటున్నాను? నా అహంకారం నేను అనుకొంటున్నాను, మీ అహంకారం మీరు అనుకొంటున్నారు. అలా అనుకోవచ్చు. అనుకోకుండా ఎవరు ఆపుచేస్తారు? కానీ అనుకున్నంత మాత్రంచేత మీరు అహంకారం అవ్వరు. మీరు ఆత్మ. భగవంతుడు మీరు అహంకారం, మీరు శరలీం అని చెప్పలేదు; మీరు ఆత్మ అని చెప్పాడు. ఒకవేళ మీరు నిజంగా శరీరమే అయితే, మీరు శరీరం అని చెప్పి ఉండేవాడు. నిజంగా మీరు అహంకారం అయితే, మీరు అహంకారం అని చెప్పి ఉండేవాడు. ఆ రెండూ మీరు కాదు కాబట్టే, మీరు ఆత్మ కాబట్టే మీరు ఆత్మ అని చెప్పాడు.

మీరు ఎవరైతే నేను నేను అనుకొంటున్నారో ఆ నేను మీరు కాదు. ఇది ముందు మీకు అర్థం అవ్వాలి. ఆ నేను మీరు కాకపోయినప్పటికీ, అది అబద్ధం అయినప్పటికీ, ఆ అబద్ధం మీలో ఎస్టాబ్లిష్ అయిపోయింది. దానిని గెంటుకోవటం కష్టం. ఇప్పుడు మీరు అనుకొనే నేను అబద్ధమే. ఎందుచేతనంటే అహంకారాన్నే నేను అనుకొంటున్నారు. అది ఎస్టాబ్లిష్ అయిపోయింది. మీలో కొంతమందికి సుఖంగా రోజులు వెళ్తూ ఉండవచ్చు. అది అబద్ధం. మీలో కొంతమందికి దుఃఖంగా రోజులు వెళ్తూ ఉండవచ్చు. అదీ అబద్ధమే. దుఃఖం అంటే ఏ దుఃఖమైనా సరే, మీ సంసార దుఃఖం అవ్వనివ్వండి, డబ్బు లేకపోతే కలిగే దుఃఖం అవ్వనివ్వండి, ఆకలి కూడా ఒక బాధే. మనకి ఏదైనా రోగం వస్తే బాధ అనుకుంటాము. రోగం ఎటువంటి బాధో, ఆకలి కూడా ఒక బాధే. అందుచేత “ఆకలి బాధ” అంటారు. ఈ దుఃఖం అహంకారానికే, ఈ సుఖం కూడా అహంకారానికే. ఇది ముందు మీకు అర్థం అవ్వాలి. సర్వసాధారణంగా ఈ లోకంలో చూడండి, మనుషులు

పుట్టింది మొదలు, భూమి మీదకి వచ్చింది మొదలు, చచ్చిపోయే వరకూ ఎవరికీ రోజులు ఒకరకంగా వెళ్ళవు - మనందరమూ ఏదో తల్లి కడుపులోంచి వచ్చాము. వచ్చింది మీకేమైనా గుర్తు ఉందా? తల్లి కడుపులోంచి వచ్చిందీ గుర్తు ఉండదు, చచ్చిపోయేటప్పుడూ గుర్తు ఉండదు. ఇవి రెండూ గుర్తు ఉండవు. మన ప్రాణం పోయేటప్పుడు కూడా మనకి గుర్తు ఉండదు. మీరు పెద్ద పాపం చేసారు అనుకోండి మాటవరసకి, ఈ లోకులు అందరూ కలసి ఈ అమ్మగారు ఎంత పెద్ద పాపం చేసేసారు అనుకోవచ్చు, మీరు ఎంత పెద్ద పాపం చేసినా అది మీ అహంకారానికి తగులుతుంది కానీ మీ ఆత్మని ముట్టుకోదు. ఈ జిన్నూరులో ఉన్న జనాన్ని అంతా ఒక్కడే చంపేసాడు అనుకోండి మాటవరసకి, వాడు నిజంగా జ్ఞాని అనుకోండి, వాడికి కొంచెం కూడా పాపం అంటదు. ఎందుచేత? మీరు ఎంత పుణ్యం చేసినా అది అహంకారానికే, పాపం చేసినా అది అహంకారానికే. పుణ్యం వెళ్ళి ఆత్మని ముట్టుకోదు, పాపం వెళ్ళి ఆత్మని ముట్టుకోదు. ఈ పుణ్యపాపాలు అహంకారం పరిధిలోనే ఉన్నాయి. పుణ్యం అహంకారానికి సంబంధించినదే, పాపం అహంకారానికి సంబంధించినదే. పుణ్యం యొక్క ఫలితం మీరు ఇప్పుడు అనుభవిస్తున్నారు అనుకోండి, ఆ పుణ్యం ఎంతసేపు ఉంటుంది? ఏదో కొన్ని రోజులు ఉంటుంది. కొన్ని సంవత్సరాలు ఉంటుంది, అది ఖర్చు అయిన వెంటనే, మళ్ళీ పాప ఖర్మ స్టార్ట్ అవుతుంది.

ఇప్పుడు ఇందిరాగాంధీ ఉంది, ఆవిడ చాలా అదృష్టవంతురాలు, ఆవిడకు డబ్బు ఉంది, పదవి ఉంది అని మనందరమూ అనుకొంటున్నాము. ఇంకొక అయిదు నెలలకో, ఆరు నెలలకో ఆవిడకి దుఃఖం రావచ్చు, డబ్బు పోవచ్చు, అధికారం పోవచ్చు, ఆ మనిషే కానీ మళ్ళీ ఇంత తేడా ఏమొచ్చింది? ఆవిడ శరీరం మీద అనుభవించవలసిన పాపఖర్మ కనుక ఉంటే ఆవిడకి స్టార్ట్ అవ్వవచ్చు. ఇప్పుడు పుణ్యఖర్మ అనుభవిస్తోంది, కొంతమంది ఇప్పుడు పాపఖర్మ అనుభవిస్తూ ఉండవచ్చు, భవిష్యత్తులో పుణ్యఖర్మ స్టార్ట్ అయ్యాక వాళ్ళు ఎంతో సుఖం అనుభవించవచ్చు, కానీ ఇదంతా అబద్ధం. మీ మనస్సు సర్వసాధారణంగా దేని మీదకి వెళ్తోందో, ఆగాలి, ఆగితేనే కానీ మీ మనస్సు అంతర్ముఖం అవ్వదు. ఒకవేళ మీరు గొప్ప భోగం అనుభవిస్తున్నప్పటికీ, అది అబద్ధం అని మీకు తెలియాలి. ఒకవేళ మీలో ఎవరైనా పెద్ద కష్టాలలో ఉన్నప్పటికీ అది అబద్ధం అని మీకు తెలియాలి, కష్టాలలో ఉన్నప్పటికీ అస్తమానూ మేము కష్టాలలో ఉన్నాము అనుకోనక్కరలేదు, వాటిని తుడిచేసుకోవటమే, మీ ఒంటి మీద దుమ్ముని ఎలా తుడిచేసుకుంటున్నారో, బట్టల మీద దుమ్ముని ఎలా దులిపేసుకుంటున్నారో,

అలా ఈ కష్టాలని కూడా తుడిచేసుకోవటమే. ఎందుచేతనంటే ఇది అబద్ధం కాబట్టి.

వాట్ ఈజ్ ఇట్ దట్ ఈజ్ బోర్న్? తల్లి కడుపులోంచి వచ్చింది ఎవరు? తల్లి కడుపులోంచి శరీరం వచ్చింది. భగవంతుడు గీతలో ఏమి చెప్పాడంటే, నువ్వు ఆత్మవు, ఆత్మకి చావు లేదు, ఆత్మకి పుట్టుక లేదు అన్నాడు. అయితే పుట్టింది ఎవరు? ఆత్మకి పుట్టుకలేదు ఆత్మకి చావులేదు అని భగవంతుడు చెప్పి వదిలేస్తే పరవాలేదు, అలా వదిలేయలేదు. పుట్టుకలేని దానికి చావు ఎలా ఉంటుంది? నేచురల్ కదా అది? ఆత్మకి పుట్టుక లేదు చావు లేదు అని అక్కడితో ఆగలేదు, మళ్ళీ ఆత్మవు నువ్వు అన్నాడు. ఇది మీరు బాగా అర్థం చేసుకోండి, పుట్టుకలేదు అని చెప్పాడు, చావు లేదు అని చెప్పాడు, అలా వదిలేయలేదు. మళ్ళీ ఆత్మవి నువ్వే అన్నాడు. అయితే ఇప్పుడు పుట్టింది ఎవరు? ఈ శరీరం పుట్టింది. మనమేమి అనుకొంటున్నాము? ఈ శరీరం నేను అనుకొంటున్నాము. మనకింక జ్ఞానం ఎలా కలుగుతుంది? ఈ క్లూ మీకు అర్థం అవ్వకపోతే మీకు జ్ఞానం కలిగే అవకాశమే లేదు. మీరు ఎన్ని సాధనలు అయినా చెయ్యండి, ఈ సబ్జక్టు మేటర్ మీద మీ బుర్ర పెట్టకపోతే, కేవలం మీరు సాధనలు చేసినా, ముక్కు మూసుకున్నా, ఏమి చేసినా మీకు జ్ఞానం కలుగదు.

మీరు నన్ను ఒంటరిగా ఒక గదిలో కూర్చోపెట్టేయండి, టైముకి కొంచెం అన్నం పెట్టి టైముకి కొంచెం కాఫీ ఇస్తూ ఉండండి నాకు, ఎన్ని సంవత్సరాలు అయినా కూర్చుంటాను. అదే ఇంకో వ్యక్తికైతే నాకు కాలక్షేపం అవ్వటంలేదు అనుకుంటాడు. ఏంటి ఎవరూ కనబడటం లేదు ఏంటి? నాకు కాలక్షేపం అవ్వటంలేదేంటి అనుకుంటాడు. కొంతమందికి ఇంట్లో ఎవరో ఒకరితో మాట్లాడుతూ ఉండాలి, లేకపోతే సెంటరులో ఎక్కడికో వెళ్ళి కూర్చుంటాడు. సెంటరులో ఎందుకు కూర్చుంటారంటే కాలక్షేపానికి, సెంటరులో కూర్చుని ఏదో ఆ గొడవలో ఈ గొడవలో దేశంలో గొడవలో చెప్పకుంటూ ఉంటారు, కాలం కిల్ చెయ్యటం కోసం. ఏమిటి ఇందులో డిసీజ్? ఒక మనిషి అలా ఎందుకు కూర్చో గలుగుతున్నాడు, ఒక మనిషి అలా ఎందుకు కూర్చోలేకపోతున్నాడు, ఏదో లోకాభిరామాయణం వేస్తేనేగానీ కాలాన్ని ఎందుకు గెంటలేకపోతున్నాడు? దీనికి కారణం ఏంటంటే, హృదయంలో అటాచ్‌మెంట్ ఉన్నప్పుడు ఒంటరిగా ఉండలేడు ఆ మనిషి. మీకు ఒక వస్తువు మీద కానీ, ఒక వ్యక్తిమీద కానీ, ఒక పదార్థం మీద కానీ, ఒక ప్రొఫెషన్ మీద కానీ కేవలం అటాచ్‌మెంట్ ఉంటే, దాని మీద కనుక ప్రత్యేకమైన అనురాగం కనుక ఉంటే, ఒంటరిగా మనిషి ఉండలేడు. నా

అటాచ్‌మెంటే నాకు దుఃఖాన్ని తీసుకొస్తుంది.

ఇప్పుడు ఒక్కోసారి మనకి కోపం వస్తూ ఉంటుంది, ఒక్కోసారి చిరాకు వస్తూ ఉంటుంది. ఒక్కోసారి అకారణంగా రియాక్ట్ అవుతూ ఉంటాము. ఏది వచ్చినా అది నాలోంచే వస్తోంది, నా బ్రెయిన్ లోంచే వస్తోంది. ఒకోసారి మీరు ఏదైనా చిన్న మాట అన్నారు అనుకోండి నన్ను, తొందరగా రియాక్ట్ అవుతున్నాను. మళ్ళీ ఎందుకు అలా రియాక్ట్ అయ్యాను అనవసరంగా అని ఆలోచిస్తున్నాను. రియాక్ట్ అయ్యేది మళ్ళీ ఆలోచించేది కూడా బ్రెయినే. మళ్ళీ సమాధానపడేది ఈ బ్రెయినే. ఇదంతా మీ లోపలినుంచే వస్తోంది, ఈ విషయం మీరు అర్థం చేసుకోండి. ఇదంతా ఏమీ లేదు, మన శరీరం ఒక నీడ, ప్రపంచం ఒక నీడ. బయట అసలు ఏమీ లేదు. బయట మీరు ఎన్ని వందల సంవత్సరాలు, ఎన్ని జన్మలు ఎత్తి మీరు పరిశోధించినా బయట ఏమీ లేదు, ఏమీ కనపడదు, ఉన్నదంతా మీ లోపలినుంచే వస్తోంది. మీరు చావు గురించి కూడా ఏమీ ఆలోచించవద్దు. ఎందుచేతనంటే మీరు ఆలోచించడానికి అది బహుస్వల్ప విషయం. మీ లోపల పేరుకుపోయిన అజ్ఞానంలోంచి బయట ఎలా పడదాము అనేదే మీరు ఆలోచించవలసిన సమస్య. బర్నింగ్ ప్రాబ్లం అది కానీ, చావు నుంచి ఎలా బయటపడదాము అనేది సమస్య కాదు. మీకు చావు లేదు కదా! మీరు ఆత్మ కదా! చావు శరీరానికి, మీరు శరీరం నేను అనుకొంటున్నారు కాబట్టి చావు వస్తే మీకు భయం వేస్తోంది. చావు అనేది ఊరికే 'ఇట్ ఈజ్ ఏ లాంగ్ స్లీప్' - అంటే పొడుగాటి నిద్ర. రాత్రులు మనం మంచం మీద పడుకొంటున్నాము - అది పొట్టి నిద్ర. చావు అంటే మనం వల్లకాడులో పడుకొనేది - అది పొడుగు నిద్ర.

ఇదే భగవంతుడు చెప్పాడు - ఈ శరీరం ఉంది, చిన్నప్పుడు కూడా ఇదే శరీరం. చిన్నప్పుడు ఉన్నట్టు ఈ శరీరం ఇప్పుడు లేదు. శరీరం రూపం మారిపోతోంది. ఇంకో పదేళ్ళు ఉన్న తరువాత ఇంకా ముసలిది అయిపోతుంది, శరీరం వడిలిపోతుంది. అదే శరీరం, సేమ్ బాడి! నాలుగో సంవత్సరంలో ఉన్నట్టు, పదో సంవత్సరంలో ఉండదు; పదో సంవత్సరంలో ఉన్నట్టు టీనేజ్‌లో ఉండదు. రవీంద్రనాథ్ ఠాగూర్ టీనేజ్ వరస్ట్ ఏజ్ అన్నాడు. ఆ వయస్సులో వాళ్ళకి తొయ్యదు, ఎదుటివాళ్ళు చెప్పింది అర్థం చేసుకోరు, ఆ వయస్సు అటువంటిది. యవ్వనం వస్తుంది, వాళ్ళు సొంతంగా ఆలోచించుకోలేరు, ఇంట్లో పెద్ద

వాళ్ళు చెప్పింది వాళ్ళకి అర్థం కాదు. ఎమోషన్ వస్తుంది, మెచ్యూరిటీ ఉండదు బ్రెయిన్లో. అందుకే దాన్ని వరస్ట్ ఏజ్ అన్నాడు - పాపం ఆ వయస్సులో వాళ్ళకి బేలన్స్ కష్టం అని. ఈ శరీరం పెరగాలి, నేను పెద్దవాడిని అయిపోవాలి అని చిన్నప్పటినుంచి నేను ఆలోచిస్తున్నానా? ఆలోచించటం లేదు, దానంతట అదే పెరుగుతోంది శరీరం. నా శరీరం పెరగాలి, రేపు ఇంకా పెద్దవాడిని అయిపోవాలి, ఎల్లుండి ఇంకా పెద్దవాడిని అయిపోవాలి, ఇలా ఆలోచిస్తూ వస్తున్నారా మీరు చిన్నప్పటినుండి? అలా ఆలోచించటంలేదే! నేను ఆలోచించకుండానే పెద్దవాడిని అయిపోయాను. ఆలోచించకుండా ముసలివాడిని అయిపోతాను, ఆలోచించకుండా చచ్చిపోతాను, ఒకవేళ ఆలోచించటం మరిచిపోతే నాకు చావు ఆగుతుందా? నో! ఇది నేచురల్‌గా జరుగుతోంది, అదేవిధంగా ఎంత సహజంగా నా శరీరం పెద్దది అవుతోందో, ముసలిది అవుతోందో, చచ్చిపోతోందో, అంతే నేచురల్‌గా నాకు ఇంకో శరీరం వస్తుంది. ఇంక ఆలోచన ఎందుకు మీకు? రాత్రి ఆరు గంటలు నిద్రపోయి ఉదయాన్నే అదే దేహంలో లేస్తున్నారు, అదే చావు అయితే ఇంకో శరీరంలో లేస్తారు. పోనీ ఇంకో ఊళ్లో ఉంటాము, ఇంకో దేశంలో ఉంటాము, ఇప్పుడున్న ఇంద్రియ భోగాలకంటే, అప్పుడు ఇంకా టెక్నాలజీ పెరిగితే కొత్త కొత్త భోగాలు అనుభవిస్తాము. మీరు ఎక్కడికి వెళ్ళినా, అమెరికా వెళ్ళండి, రష్యా వెళ్ళండి, డెవలప్డ్ కంట్రీస్‌కి వెళ్ళిపోండి, అక్కడ ఇంద్రియ భోగాలు తప్పించి ఏమీ లేవు. అక్కడ ఏదో ఉంది అనుకుంటారు, అక్కడ కూడా ప్లెజర్స్, సెన్సెస్‌తో అనుభవించే భోగాలే కానీ, ఫారిన్ కంట్రీస్‌లో కూడా ఏమీ లేదు. అక్కడ కూడా అశాంతే! మన ఇండియాలో కంటే అమెరికాలో అంత ఎక్కువ డబ్బు, అంత భాగ్యవంతమైన దేశం అయ్యి వుండి, అక్కడ కూడా విపరీతంగా ఆత్మహత్యలు చేసుకుంటారు, ఒకరినొకరు తుపాకులతో కాల్చుకు చంపుకుంటారు. డబ్బే మన గమ్యం అనుకోండి డబ్బు మిమ్మల్ని ఉద్ధరించేస్తుంది అని భగవంతుడు చెప్పేవాడు. మనకి డబ్బు అవసరమే, అయితే డబ్బే గమ్యం కాదు. అలాగే చదువు కూడా అవసరమే, చదువే గమ్యం కాదు. ఇది మీకు అర్థమవ్వాలి. జనరల్‌గా పరిణామంలో భోగి రోగి అవుతాడు, యోగి జ్ఞాని అవుతాడు. పరిణామంలో తప్పనిసరిగా జరిగేది ఏమిటంటే, భోగి రోగి అవుతాడు, యోగి జ్ఞాని అవుతాడు.

పరదేవత అంటే ఎవరు? పరదేవత అంటే మీరు పార్వతీదేవి అనుకొంటున్నారు. లేకపోతే లక్ష్మిదేవి అనుకొంటున్నారు, లేకపోతే సరస్వతీదేవి అనుకొంటున్నారు. ఆచార్యులవారు చెప్పింది ఏమిటంటే, జ్ఞానమే పరదేవత. నేను మీ దగ్గర కూర్చున్నప్పుడు గంటో అరగంటో

మౌనంగా ఉంటున్నాను కదా! ఈ మౌనాన్ని విడిచిపెట్టి మాటలలోకి వచ్చేటప్పుడు నాకు పెయిన్ వస్తుంది. అంటే పంచదారలో ఉన్న చీమని బయటికి తీసేస్తే ఆ చీమ ఎంత బాధపడుతుందో, నేను ఇక్కడ మౌనం వదిలేసి మీతో మాట్లాడటం కూడా నాకు అంత బాధ వస్తుంది. నేను నేచురల్‌గా మీకు చెప్పలేకపోతున్నాను. మౌనమే నాకు నేచురల్. ఆచార్యులు వారు చెప్పేది ఏంటంటే, పరదేవత ఎవరని? జ్ఞానమే పరదేవత. జ్ఞానానికి కూడా శక్తి ఉంది. జ్ఞానమే మోక్షం, జ్ఞానమే ధర్మం, జ్ఞానమే సుఖం, జ్ఞానమే అభయం, సర్వం జ్ఞానమే. మనకి జ్ఞానం కలిగేవరకు భయం వేస్తూనే ఉంటుంది. చాలామందికి ఫిక్స్‌డ్ ఇన్‌కం ఉంటుంది, ప్రతినెల ఒకటో తారీఖు వచ్చేసరికి మనకి ఇంత ఇన్‌కం గ్యారంటీ అని అలా ఫిక్స్‌డ్ ఇన్‌కం ఉన్న వాళ్ళకి కూడా ఎందుకు దుఃఖం వస్తోంది? వాళ్ళకి ఎందుకు భయం వేస్తోంది? వాళ్ళకి కూడా లైఫ్‌లో సెక్యూరిటీ ఎందుకు కనబడటంలేదు?

మనకి శరీరము, వాక్కు, మైండు, ఇవి మూడు ఇన్‌స్ట్రుమెంట్స్. వీటిని మీరు సరిగ్గా వాడుకోకపోతే మీరు పుస్తకాలు చదివినా, ఈ మూడింటిని మీరు ప్రోపర్‌గా వాడుకోకపోతే, మీకు జ్ఞానం రాదు. పూజలు చేసినా, జపాలు చేసినా, వీటిని పెర్‌ఫెక్టుగా వాడుకోవాలి. సర్జన్ తన కత్తితో ఎలా పడితే అలా కట్ చెయ్యడు. సర్జన్ తన కత్తిని ఎంత యాక్యురేట్‌గా ఉపయోగించుకుంటాడో, అంత యాక్యురేట్‌గా ఈ బాడీని, మైండుని, ఈ కనిపిస్తున్నటువంటి ఇంద్రియాలని, వాక్కుని, అంత జాగ్రత్తగా ఉపయోగించుకొన్న వాడికి, పుస్తకాలు చదవకపోయినా వాడికి జ్ఞానం వచ్చేస్తుంది.

మన పందలపాక డాక్టరుగారికి సోమరితనం అసలు లేదు. రాత్రీపగలు కూడా కష్టపడి పని చెయ్యమంటే చేస్తారు. పగలు అస్తమానూ పని చేసి రాత్రి 400 మైళ్ళు కారులో వెళ్ళి వచ్చేయమన్నా వచ్చేస్తారు. లేజీనెస్ ఆయనకి లేదు. అలా కర్మ చేస్తూ ఉంటారు. అయితే ఇందులో ఒక చిన్న విషయం ఉంది. సహజంగా ఆయన చేసే పనే, ఆసక్తి లేకుండా చేస్తే జ్ఞానం వచ్చేస్తుంది. ఆసక్తితో చేస్తే బంధిస్తుంది. డాక్టరుగారు అంటే డాక్టరుగారే కాదు, మీరైనా సరే నేను అయినా సరే, పని ఎలాగూ చేస్తున్నాము, మనం చేసే ఆ పనే, ఆసక్తి లేకుండా కనుక చేస్తే జ్ఞానం వచ్చేస్తుంది. ఎర్రబట్టలు కట్టుకున్నవాడు నిజమైన సన్యాసి అని ఎక్కడా గీతలో చెప్పలేదు. ఎవడు సన్యాసి అంటే, ఆసక్తి లేకుండా ఎవడైతే పని చేస్తున్నాడో వాడు సన్యాసి. మీరు ఎంత పనిచేసినప్పటికీ ఆసక్తి కనుక మీకు

లేకపోతే మీకు దుఃఖం పుట్టదు. ఎప్పుడూ పని వల్ల దుఃఖం రాదు. ఆసక్తి ఉంటే దానివల్ల దుఃఖం వస్తుంది.

మీకు రాముడు కనిపించాడు అనుకోండి, నాకు దేవుడు కనిపించాడు అనుకొంటున్నారు. లక్ష్మీదేవి కనిపిస్తే నాకు లక్ష్మీదేవి కనిపించింది అంటారు. కనిపించింది రైటే, మీకు లోపల అజ్ఞానం పోయిందా? కొంతమంది అంటూ ఉంటారు మాకు దేవుడు కనిపించాడు అని, నిజంగా కనిపించాడు అనుకొందాము, అది అబద్ధం అనుకోవటం ఎందుకు? నిజంగా కనిపించాడు, ఈ కనిపించిన వాళ్ళకి ఎవరికైనా అజ్ఞానం పోయిందా? నాకు కనిపించలేదు కాబట్టి నాకు పోలేదు! దేవుడు కనిపించాడు అని చెప్పిన వాళ్ళకి అజ్ఞానం పోవాలి కదా, వాళ్ళకి దేవుడు కనిపించటం నిజమైతే? వాళ్ళకి లోపల అజ్ఞానం ఎందుకు పోలేదు? ఆచార్యులు వారు ఇక్కడ మంచి క్లూ చెపుతున్నారు. జ్ఞానమే పరదేవత, మీకు జ్ఞానం కలగటమే, మీకు పరదేవత దర్శనం అయినట్టు.

ఒక్కోసారి మీకు కలలో దేవుడు కనిపించినట్టు రావచ్చు. అలాగే మీకు ప్రపంచంలో కూడా మీకు దేవుడు కనిపించొచ్చు. రాముడో, కృష్ణుడో, మీరు ఎవరైతే ఇష్టదేవతని ప్రార్థిస్తున్నారో వారు కనిపించొచ్చు. మీరు వరాలు అడగొచ్చు, ఆయన ఇవ్వచ్చు, ఇదంతా నిజమై ఉండొచ్చు. అంతమాత్రంచేత మీ అజ్ఞానం పోయిందా? ఆ దేవుడు వరం ఇస్తాడు, మీ దగ్గర ఎంతకాలం ఉంటుందా వరం? పైగా వరాలు మోస్ట్ డేంజరస్. అయితే మోస్ట్ డేంజరస్ అని దేవుడికి తెలియదా? తెలుసు! మీరు అడుగుతున్నారు కాబట్టి ఇస్తున్నాడు. మీకు తెలియకపోవచ్చును వరంలో ఎంత డేంజర్ ఉందో, ఆయనకి తెలుసు. ఆయనకేంటి, మీరు అడిగారు కాబట్టి ఇస్తున్నాడు! మీరు భగవంతుడిని ప్రార్థిస్తూ ఏమీ అడగకుండా ఉంటే ఇంక నిద్ర పట్టదు ఆయనకి! ఈ జీవుడిని ఎలా ఉద్ధరించాలి, నామీద పడేస్తున్నాడు భారం. వీడేమీ అడగడే, కొంపతీసేస్తున్నాడు! అడిగితే అడిగింది ఇస్తాడు అంతటితో సరి, అడగడనుకోండి జీవుడు, ప్రార్థిస్తూ ఉంటాడు అనుకోండి, అప్పుడు ఆయనకు కష్టం అన్నమాటే! ఈ సృష్టి విషయం కూడా మర్చిపోయి వీడి గురించి ఆలోచిస్తూ ఉంటాడు. ఎవడైతే దేవుడిని ప్రార్థిస్తూ దేవుడిని ఏమీ అడగడో, వాడు గురించి ఆలోచిస్తాడు, వీడిని ఎలా ఉద్ధరించాలి అని చూస్తాడు.

నేను ఆత్మను అని భగవంతుడు చెప్పాడు. నేను ఆత్మని అయ్యి ఉన్నప్పుడు, నేను

ఆత్మని తెలుసుకోవటానికి ప్రయత్నం చెయ్యటం ఏంటి అసలు? అయితే నేను ఇప్పుడు ఎక్కడ ఉన్నాను? ఈ ఒక్క క్లూ మీరు అర్థం చేసుకోండి, ఈ క్షణంలో మీరు జ్ఞానులు అవుతారు. తీవ్రమైన తపన కనుక మీకు ఉంటే మూడు గంటలు చాలు అని రామకృష్ణ పరమహంస చెప్పాడు. మూడు గంటలు కాదు, ఒక్క సెకను చాలు! రామకృష్ణ పరమహంస ఏం చెప్పాడంటే, చెరువులో ఒక మనిషిని ముంచేస్తే, చెరువులో ముంచబడ్డ ఆ మనిషి గాలి కోసం ఎలా కొట్టుకుంటాడో, అలా భగవంతుడి కోసం మూడు గంటలసేపు తపన పొందితే, మూడు జన్మలు కాదు, మూడు గంటలు, అలా మూడు గంటలసేపు ఎవడైతే తపిస్తాడో వాడికి జ్ఞానం కలుగుతుంది, వాడికి భగవంతుడు దర్శనం ఇస్తాడు అని చెప్పాడు. మోస్ట్ నేచురల్! భగవంతుడు మీరు ఆత్మ అని చెప్పాడు, అయితే ఆత్మని తెలుసుకోవటం ఏంటి అసలు! అంటే ఇప్పుడు ఎక్కడ ఉన్నాము? ఇది మీరు ఇంటికి వెళ్ళి ఆలోచించండి. ఎందుకు మీరు నాచేత తొంబై మాటలు చెప్పిస్తారు!

భగవంతుడు మటుకు అబద్ధం చెప్పడు మనకి. ఎందుచేతనంటే మనని నిజంగా ప్రేమించేవాడు భగవంతుడు తప్ప ఎవరూ లేరు. ట్రూ లవర్, లాయల్ లవర్, ఫెయిత్‌ఫుల్ లవర్ మనకి ఎవరంటే భగవంతుడే. మనల్ని భగవంతుడి కంటే ఎవరూ ఎక్కువ ప్రేమించరు. మనం అనుకుంటాము వాళ్ళు ప్రేమిస్తున్నారు వీళ్ళు ప్రేమిస్తున్నారు అని. ఇది అహంకారానికి సంబంధించినది. ఇప్పుడు మీరు మామూలుగా అనుకొనే ప్రేమలు అన్నీ అబద్ధం. మీరు దైనందిన జీవితంలో ప్రేమలు ప్రేమలు అనుకొంటున్నారు. ఇవన్నీ ఫాల్స్! ప్రేమనేది ఒక ఫీలింగ్ కాదు. ఇప్పుడు నాకు సడన్‌గా కడుపునొప్పి వచ్చింది అనుకోండి, ఒక ఐదు నిమిషాలో పది నిమిషాలో బాధపడతాను. మళ్ళీ ఒక మాత్ర మింగేస్తే పోవచ్చును. నాకు కడుపు నొప్పి ఎలా వచ్చిందో సడన్‌గా, అలా ఆప్యాయత పుట్టొచ్చు. దట్ ఈజ్ ఆల్ సో ఎ ఫీలింగ్! అది కూడా తలంపే. ప్రేమ అయితే, అది ఎటర్నల్‌గా ఉంటుంది.

సాధారణంగా లవ్ అనేది తలంపుకి పరిమితం చేసుకొంటున్నారు. అది నిజం కాదు. లవ్ కనుక ఫీలింగ్ అయితే, ఫీలింగ్ పోయిన వెంటనే లవ్వూ పోతుంది. ఇప్పుడు నాకు కడుపు నొప్పి వచ్చింది. తగ్గిపోయింది అనుకోండి, మామూలు స్టేట్‌కి వచ్చేస్తున్నాను, అలాగే ఫీలింగ్ కూడా ఒక నేచురల్ ప్రాసెస్ కాదు. కడుపు నొప్పి అన్-నేచురల్, నేచురల్ కాదు. కడుపు నొప్పి అనేది అన్-నేచురల్ కాబట్టే మందు వేసుకొంటే పోతోంది. అదేవిధంగా

ఫీలింగ్ కూడా, కేవలం అది అన్-నేచురల్ కాబట్టి స్టాండర్డ్‌గా ఉండదు, అది కూడా పోతుంది. అంటే మనం ఒకళ్ళనొకళ్ళము ప్రేమించుకుంటే, ఇది ప్రేమ అని మాటవరసకి అనుకొంటాము, కాని అది అబద్ధం.

మరి నిజమైన ప్రేమ ఎక్కడినుంచి వస్తుంది? ఒక భగవంతుడిలోంచి వస్తుంది ఎంచేతంటే భగవంతుడు నిజం కాబట్టి. అంటే భక్తుడు ఏమనుకొంటాడు - తనకొచ్చే కష్టాలు అన్నీ భగవంతుడి ప్రసాదాలు అనుకొంటాడు. నిజమైన ప్రసాదం ఏంటంటే, కష్టమే నిజమైన ప్రసాదం. కొంతమంది మహాభక్తులు ఏంచెప్పారంటే, భగవంతుడు ఎవరినైతే ఎక్కువగా ప్రేమిస్తున్నాడో వారిని ఎక్కువ కష్టాలకి గురిచేస్తాడు. ఎంచేతంటే అంత కష్టం పెడితేనే కానీ వాడి మనస్సు అంతర్ముఖం అవ్వదు.

మనం ఆత్మ అని చెప్పాడు అంటే మన స్వరూపం అదే. అయితే మనం ఇప్పుడు ఆత్మని పొందుదాం అని ప్రయత్నం చేస్తున్నాము. ఈ ప్రయత్నం చేసేవాడు ఎవడు? ప్రతీవాడు నేను జ్ఞానిని అవ్వాలి, ఆత్మని తెలుసుకోవాలి అని ప్రయత్నం చేస్తున్నాడు కదా! ఈ తెలుసుకొనే వాడు ఎవడు? నేను ఆత్మని అయినప్పుడు, ఈ తెలుసుకొనేవాడు ఎవడు? ఇది మీరు అర్థం చేసుకోండి. ఆ తెలుసుకొనేవాడిని వదిలేస్తే ఆత్మ ఇక్కడే ఉంది.

ఇది మీకు మింగటానికి కొంచెం కష్టంగా ఉందా? భగవంతుడిని ప్రార్థించేది వరాల కోసమే కదా! ఆయన వరం ఇచ్చేస్తాడు. ఆ వరం మనము భోగిస్తాము. భోగించేటప్పుడు ఒక అనుభవంగా ఇక్కడ వస్తుంది. నా నోట్లో మీరు పంచదార వేసారు అనుకోండి, నేను ఆ పంచదార తింటాను. ఎంతబాగుంది, అనుకొంటాను. పంచదార నేను తినేయటం అయిపోయింది, నా కడుపులోనికి వెళ్ళిపోయింది, అరిగిపోయింది, కానీ పంచదార చాలా బాగుంది అనే అనుభవం ఒకటి ఇక్కడ ఉండిపోయింది నాకు. ఈ అనుభవం మళ్ళీ రిపీట్ అవుతూ ఉంటుంది. నువ్వు మళ్ళీ పంచదార సంపాదించు పంచదార సంపాదించు అంటుంది. నేను భోగం అనుభవించాను, భోగం అనుభవించటం వల్ల ఒక అనుభవం నాకు వచ్చేసింది. ఈ అనుభవం నన్ను బంధిస్తోంది. ఈ అనుభవం నన్ను బంధించి మళ్ళీ అదే రిపిటీషన్ కోరుతోంది.

ఈ మధ్యన ఒక ఇంగ్లీషు కవి చెప్పాడు - మీరు రోజూ బైబిలు చదవటం ఎందుకు? రోజూ భగవద్గీత చదవటం ఎందుకు? మరి రోజూ ఈ ఉపన్యాసాల గొడవ ఎందుకు?

రోజూ ధ్యానాలు ఎందుకు? రోజూ ప్రార్థనలు ఎందుకు అంటున్నారు కదా? మరి రోజూ చేసే సంసారం ఎందుకు చేస్తున్నారు? ఈవేళ చేసారు సంసారం మరి ఊరుకోవచ్చును కదా! మళ్ళీ రేపు అదే సంసారం, ఎల్లుండి మళ్ళీ సేమ్ అదే సంసారం కదా! ఈ ఎక్స్‌పీరియన్స్‌లోంచి ఎలా బయటపడటం? ఇక్కడ నాకు దేవుడు ఒక భోగం ఇచ్చాడు, తప్పకున్నాడు. అంటే నాకు ఉరి శిక్ష వేసినట్టు అన్నమాట ఆయన! ఉరిశిక్ష ఏంటి అంటే, నేను ఏదో అడిగాను, నాకేదో వరం ఇచ్చేసాడు. శివుడు కనిపించాడు అనుకోండి, ఇచ్చేసి కైలాసం వెళ్ళిపోయాడు. విష్ణువు కనిపించాడు అనుకోండి, ఇచ్చేసి వైకుంఠం వెళ్ళిపోయాడు. ఆయన సుఖంగా ఉన్నాడు అక్కడ. మరి నా మాట ఏంటి? ఆయన ఇచ్చిన భోగం నేను అనుభవించాను. ఆ భోగం నేను ఎప్పుడైతే నా ఇంద్రియాలతో అనుభవించానో, ఇంద్రియాలతోటి భోగించానో, భోగించిన వెంటనే అనుభవం ఏర్పడుతుంది హృదయంలో, ఈ అనుభవం నన్ను బంధిస్తుంది. ఈ అనుభవంలోంచి మళ్ళీ బయటపడటం కోసం ప్రయత్నం చేస్తాము. ఇదే సాధన అంటే. నా భోగమే నా అనుభవంలో ఉన్నప్పుడు, ఆత్మ నేనైనప్పటికీ, నాలో ఉన్న ఆత్మ నాకు అనుభవంలోకి రావటం లేదు. ఈ అనుభవం ఆపుచేస్తోంది ఆత్మ అనుభవంలోకి రాకుండా. కానీ పరదేవత అంటే జ్ఞానం అనే విషయం గుర్తు ఉంచుకోండి. బొమ్మలు కాదు.

మీరు ఎవరిమీదా తీర్పులు చెప్పకండి. ఎదుటి మనుషుల గురించి వాళ్ళు మంచి వాళ్ళని, చెడ్డవాళ్ళని ఆ గొడవలు మీరు పెట్టుకోకండి. వాళ్ళు మంచి వాళ్ళైతే మీకు కలిసివచ్చేది ఏంటి? వాళ్ళు చెడ్డవాళ్ళైతే మీకు కలిసివచ్చేది ఏంటి? వాళ్ళు మంచి వాళ్ళు, వీళ్ళు చెడ్డ వాళ్ళు, అని మీరు అనుకొంటారు అనుకోండి, దాని వల్ల వాడు మంచివాడు అనుకొన్నప్పుడు మీ అహంకారం పొంగుతుంది వాడు కనిపించినప్పుడు, వీడు చెడ్డవాడు అనుకొన్నప్పుడు మీ అహంకారం ముడుచుకుపోతూ ఉంటుంది. రెండింటివల్లా దుఃఖం వస్తుంది. బాగా మంచివాడు అని ఏదో అనుకుంటారు అనుకోండి, మనస్సులో ఏదో వికారం వస్తుంది సడన్‌గా. చెడ్డవాడు అనుకొంటారు అనుకోండి, అప్పుడూ మనస్సులో వికారం పుడుతోంది. రెండింటివల్లా మీకు దుఃఖం వస్తుంది. మీరు అనవసరంగా దుఃఖాన్ని పోగుచేసుకోవద్దు, ఎదుటివాళ్ళ మీద తీర్పులు చెప్పటం మానేయండి. మీరు ఎదుటివాళ్ళ మీద తీర్పులు చెపుతున్నంతకాలం మిమ్మల్ని దుఃఖం వెంటాడుతూ ఉంటుంది. మీ శరీరం కూడా మీ నీడ

ఎలా వస్తుందో, మీ కూడా దుఃఖం అలా వస్తుంది.

నా గురించి ఆలోచించుకోవటానికి నాకు టైము లేనప్పుడు, నా గురించి నేను తెలుసుకోవటానికి నాకు టైము లేనప్పుడు, మీ గురించి నేను ఆలోచించడం ఏమిటి? ఎవరో మా ఇంటికి వచ్చి యన్.టి. రామారావు ఏమౌతాడు అని ఏదో అడగబోతున్నాడు. పక్కాయన చెప్పాడు, నా పొట్ట ఎలా గడుస్తుంది అని నేను ఏడుస్తుంటే, యన్.టి. రామారావు గొడవ మాకెందుకండీ అంటున్నాడు. పాపం ఆయనేదో నన్ను అడగటానికి వచ్చాడు, పుల్లలాగ వీడొచ్చి యన్.టి. రామారావు గొడవ ఏమౌతుంది అంటున్నాడు! ఎంత విజ్ఞానం చెప్పాడో! ఏమండీ యన్.టి. రామారావు గొడవ మాకెందుకండీ, మా పొట్ట కోసం మేము ఏడుస్తున్నాము. ఆయన ముఖ్యమంత్రిగా ఉంటే నాకెందుకు పోతే నాకెందుకు? నా పొట్ట గురించి ఆలోచించుకోవటానికి నాకు టైము చాలటంలేదు. నాకు రోజులు ఎలా వెళ్తాయో ఆలోచించుకోవటానికి నాకు టైము చాలటంలేదు. ఇవాళ ఎలా గడుస్తుందో నాకు తెలియటం లేదు. యన్.టి. రామారావు ముఖ్యమంత్రి అయితే నాకేంటి, అవ్వకపోతే నాకేంటి! నా టైము నాకే చాలదు. వీడు చెప్పేది నిజం! సిన్సియర్ స్ట్రగుల్ వాడిది! వాడిది ఆకలి బాధ! అలా మీ సమస్యలు మీరు ఆలోచించుకోండి, జ్ఞానం తెలుసుకోవటానికి మీరు ప్రయత్నం చెయ్యండి. మూడో వ్యక్తి గురించి మీకెందుకు? రామాయణం చదివేటప్పుడు రావణాసురుడిని ఎందుకు అస్తమానూ తిట్టిపోసుకోవటం! తిడితే ఏంటి మీకు కలిసివచ్చేది? పోనీ రావణాసురుడు దుర్మార్గుడే అనుకోండి, మీరూ నేను చంపగలమా రావణాసురుడిని? రాముడే చంపాలి. ఈలోపు మనకి నోరు నొప్పి. వచ్చే ఆదివారం నాటికి మీరు ఇంటి దగ్గర ఆలోచించవలసింది ఏమిటి అంటే - చాలా కూల్‌గా ఆలోచించండి. మీ బుర్రలకి మటుకు ఎట్టి పరిస్థితులలో వేడి కలగనివ్వకండి. సర్వసాధారణంగా ఈ ఆధ్యాత్మిక మార్గంలో ఉన్న వాళ్ళు శరీరానికి కానీ బుర్రకి కానీ వేడి కలగకుండా చూసుకోవాలి. శరీరానికి కంఫర్ట్ ఉండాలి, మైండుకి కంట్రోల్ ఉండాలి. ఇవి రెండూ జాగ్రత్తగా చూసుకోండి. బుర్రకి కానీ శరీరానికి కానీ తొందరగా వేడి మట్టుకు కలగనివ్వకండి. వేడి చేసే వస్తువులు తినొద్దని అందుకే అంటున్నాను. మీకు బాడీ మైండ్ కూడా కూల్‌గా ఉండాలి. ఎందుకంటే పనిముట్లు సరిగ్గా లేకపోతే మనం పనిచెయ్యలేము. ఇవి పనిముట్లు. మనము ఆపరేషన్ చెయ్యాలి అనుకోండి, కత్తి తెగకపోతే మనమేం చేస్తాము? కత్తి తెగాలి కదా అసలు! అదేవిధంగా ఈ శరీరము మనస్సు ఇంద్రియాలు ఇవన్నీ పనిముట్లు. ఇవి కండిషనులో ఉండాలి.

కండిషనులో ఉంటేనే కానీ మనం సరిగా ప్రయాణం చేయలేము.

ఆత్మ నువ్వే అని భగవంతుడు చెపుతున్నాడు. ఇది సెంట్ పర్సెంట్ కరెక్ట్. ఇందులో అబద్ధం లేదు. అయితే ఆత్మ నేను అన్న సంగతి ఇక్కడ ఎవరికీ అనుభవం లేదు. అయితే మనం ఆత్మని తెలుసుకోవాలి. ఆత్మని పొందాలి ఇలా అనుకొంటున్నాము. ఆత్మని తెలుసుకోవాలి అనుకొనే వీడెవడు? ఆత్మని పొందాలి అనుకొనేవాడు ఎవడు? వాడిని పట్టుకోండి రేపు ఆదివారం నాటికి. ఇది నిజమే కదా! ఇది మీ అందరి అనుభవంలో ఉంది. వచ్చే ఆదివారం నాటికి వాడెవడో పట్టుకోండి. పట్టుకొని మీకు దొరికితే తీసుకురండి! వాడిని పట్టుకోండి, వెతకండి మీలో ఉన్నాడు కదా వాడు! సెర్చ్ ఫర్ హిమ్! వాడిని పట్టుకొంటే మీ సమస్యలన్నీ పరిష్కారం అయిపోయినట్టే. మీ ప్రోబ్లెంస్ క్రియేట్ చేసేవాడు వాడే!

ఒకసారి భగవాన్ దగ్గరకి ఎవరో బీదవాడు వచ్చాడు. వాడు వచ్చి స్వామీ మీకు రెండు అరటిపళ్ళు కొని తేవాలి అనుకొన్నాను, నా దగ్గర డబ్బులు లేవు, అందుచేత ఏమీ తేలేదు, వచ్చేసాను. మనస్సులో కోరిక ఉంది భగవాన్‌కి రెండు అరటిపళ్ళు తేవాలని, తేవటానికి డబ్బులు లేవు, అందుచేత మామూలుగా వచ్చేసాను అన్నాడు. భగవాన్ అన్నారు, ఊరికే వచ్చాను అంటావేంటి, నిన్ను నువ్వు తీసుకొచ్చావు కదా! నువ్వు వచ్చావు కదా! అదే కదా ఇక్కడ కావలసింది. కావలసింది నీ అరటిపళ్ళు, బత్తాయి కాయలు కాదు కదా! నిన్ను తీసుకొచ్చావు కదా! అంటే నీ అహంకారం వచ్చింది కదా ఇక్కడికి. బాగు చెయ్యవలసింది దాన్నే కదా! ఏమీ తేలేదండీ స్వామీ అంటున్నాడు, ఏమీ తేలేకపోవటం ఏంటి, నువ్వు వచ్చావు కదా! నీ అహంకారం మోసుకొచ్చావు కదా! అదే తేవటం. ఇంక నువ్వు తెచ్చేది ఏంటి ఇక్కడికి?

భగవంతుడి పట్ల మీరు పొందే శరణాగతి కనుక నిజమైతే, ఇఫ్ ఇట్ ఈజ్ రియల్, భగవంతుడి పట్ల మాకు భక్తి ఉంది మేము శరణాగతి పొందుతున్నాము అనే మాట కనుక నిజమైతే, మీకు దుఃఖం రాదు. మీరు జ్ఞానం దాకా ఆత్మ దాకా వెళ్ళొద్దు అసలు. మీరు భగవంతుడిని వేడుకొనే శరణాగతి కనుక నిజమైతే మీకు దుఃఖం అనే సమస్య లేదు. ఇప్పుడు మీరు, నేను వేరుగా ఉన్నాము. వేరుగా ఉన్నప్పుడు విడిపోవటం తప్పదు. ఇంకో గంటసేపు కూర్చుంటాము, ఇంకో రెండు గంటలసేపు కూర్చుంటాము. కానీ విడిపోవటం తప్పదు. అలా మీ ఇంట్లో వాళ్ళు ఉన్నారు అనుకోండి - మీ భర్తలో, మీ తల్లితండ్రులో, మీ

పిల్లలో ఉన్నారనుకోండి, మీరూ, వాళ్ళూ విడిపోవటం తప్పదు. ఇప్పుడు మనం ఇక్కడ ఒక గంటలో విడిపోతాము. మీరు ఇంట్లో కూడా విడిపోవటం తప్పదు. వేరు అనుకొన్నప్పుడు విడిపోవటం తప్పదు. ఏదో ఒక శరీరం ముందు పోతుంది, ఒక ఇంట్లో వాళ్ళు కూడా విడిపోవటం తప్పదు. ఎప్పుడైతే మనం కలుసుకున్నామో అప్పుడు సెపరేషన్ తప్పదు. విడిపోవటం అనేది తప్పదు, అది నేచురల్. అయితే మిమ్మల్ని నేను వేరుగా చూసినప్పుడు, నాకు ప్రేమ కలుగుతూ ఉంటే అది ఫీలింగ్ అవుతుంది కానీ ప్రేమ కాదు. అంటే నాలో ఆత్మని నేను దర్శించినప్పుడు, నాకు మీలో ఆత్మే కనిపిస్తుంది. మీలో కూడా ఆత్మని నేను చూడగలిగినప్పుడే అది ప్రేమ. మీలో ఆత్మ కనబడకుండా, మీ శరీరమో మనస్సో లేకపోతే మీ వికారాలో నాకు కనిపిస్తుంటే అది ప్రేమ కాదు, అప్పుడు విడిపోవడం తప్పదు.

# నాన్నగారి మాటలలో భగవాన్‌తో వారికున్న అనుబంధం

ఎంతోమంది మహాత్ములు, ఎంతోమంది మహర్షులు, ఎంతోమంది యోగులు ఈ భూమి మీదకి వచ్చారు. వాళ్ళ అనుగ్రహంతోటి ఈ భూమిని తడిపారు. రమణమహర్షి గారు ఒక్కరే జ్ఞాని మిగతావారికి జ్ఞానం లేదు అని కాదు. రమణమహర్షిగారికి నాకు ఉన్న సంబంధం జన్మాంతర అనుబంధం. నేను పలానా అని చెప్పి మాట్లాడి వెళ్ళిపోతే నేను నమ్ముతానో నమ్మనో అని ముద్దు కూడా పెట్టుకొన్నారు. ఆ ముద్దు ఎలా ఉందంటే, ఫిజికల్‌గా ముద్దు పెట్టుకోవటం కంటే స్ట్రాంగ్‌గా ఉంది. మూడు రోజులు అస్తమానూ తుడుచుకుంటూనే ఉన్నాను. తడి వచ్చేసింది అది. పొద్దున్న స్నానం చేసాను, మళ్ళీ ఆ తడి అలానే ఉండిపోయింది. మూడు రోజులు తుడుచుకుంటూనే ఉన్నాను. అది భౌతికమైనది కాదు, భౌతికమైన దానికంటే బలంగా ఉంది.

రమణభగవాన్ మా హృదయంలో ప్రవేశించాక, ఆయన పట్ల మేము ఎటువంటి ఆప్యాయత, ఎటువంటి గౌరవంతోటి ఉన్నామో ఈనాటి వరకూ అలాగే ఉన్నాము. 1957వ సంవత్సరములో జిన్నూరు ఎలిమెంటరీ స్కూలులో రమణజయంతి చేసాము. ఆనాడు ఎటువంటి గౌరవంతోటి ఉన్నామో ఈనాడూ అటువంటి గౌరవంతోటే ఉన్నాము. ఇందులో మా తెలివితేటలతోటి సంబంధం లేదు, అది జన్మాంతర అనుబంధం. రమణభగవాన్ ఒక మాట చెప్పారు. భూమిలో నీళ్ళు ఉన్నాయి. అక్కడో గెడ్డపార, ఇక్కడో గెడ్డపార వేస్తే భూమిలో నీళ్ళు ఎలా వస్తాయి? ఒకేచోట నువ్వు తవ్వు, అప్పుడు నీళ్ళు పడతాయి అక్కడ. ఒకేచోట నువ్వు తవ్వకుండా అక్కడో గెడ్డపార, ఇక్కడో గెడ్డపార వేస్తే నీకు లోపల నీళ్ళు ఎలా

దొరుకుతాయి. అక్కడో గెడ్డపార ఇక్కడో గెడ్డపార వేసే మనస్తత్వం మాకు ఉంటే, ఏనాడో ఆయనని వదిలేద్దుము. అయితే మా తెలివితేటల వల్లే వదలకుండా ఉండలేదు. మేము ఆయనని పట్టుకోలేదు, ఆయనే మమ్మల్ని పట్టుకున్నాడు కాబట్టి అలా ఉన్నాము. మేము ఆయనని స్మరించటం లేదు, ఆయనే మమ్మల్ని స్మరిస్తున్నాడు కాబట్టి మేము కట్టుబడి అలా ఉన్నాము. ఇందులో మా తెలివితేటలతోటి ఏమీ సంబంధం లేదు. మాకంటే తెలివైనవాళు మీలో కొన్నివేల మంది ఉండవచ్చు. మాకంటే సమర్థులు మీలో ఉండవచ్చు, లోకంలోనూ ఉండవచ్చు. ఉన్నారు కూడా! తెలివితోటి ఇందులో సంబంధం లేదు. ఆయన మమ్మల్ని స్మరిస్తున్నాడు కాబట్టి, ఎప్పడైనా రమణా రమణా అనుకుంటే, ఆ రమణా అనుకునే బుద్ధి ఆయన ఇస్తున్నాడు కాబట్టి ఇలా పడి ఉన్నాం! యూనిఫారంగానే ఉన్నాం! దానికి కారణం కేవలం ఈ జన్మలో చేసిన కృషి కాదు, జన్మాంతర అనుబంధం. రమణమహర్షి జ్ఞానేకాదు, గురువేకాదు అంటారు అనుకోండి కొంతమంది, ఊరికే మాటవరసకి అనుకోండి, మాకేమీ మనస్సు చలించదు. కారణం ఏమిటంటే, జన్మాంతర అనుబంధం. ఇందులో మా తెలివితోటి ఏమీ సంబంధం లేదు. కాళిదాసు చెప్పాడు, జన్మాంతర అనుబంధం కనుక ఉంటే, ఆ శరీరం శవం అయ్యేవరకు ఆ అనుబంధం విడిచిపెట్టదని!

అందుచేత మనకు జ్ఞానం కలిగే వరకు గురువు అలా వెంటాడుతూనే ఉంటాడు. జీవితాన్ని ఎప్పడు మలుపు తిప్పాలో, ఎలా తిప్పాలో అదంతా గురువు చూసుకుంటాడు. ఒక్కోసారి గురువు మనల్ని విడిచిపెట్టేసినట్లు అనిపిస్తుంది. మనకి విడిచిపెట్టేసినట్లు అనిపిస్తుంది కానీ, మళ్ళీ దగ్గరకి తీసుకొని గట్టిగా కౌగిలించుకోవటానికే అలా చేస్తాడు, అది తెలిసినవాడు ధన్యుడు, అదృష్టవంతుడు. పులినోట్లో పడ్డ మాంసపు ముక్క అంటే అదే! గురువు యొక్క నవ్వు మామూలు నవ్వు కాదు. అది ఆత్మ యొక్క నవ్వు. గురువు నవ్వాడు అనుకోండి, సినిమాలో నవ్వమంటారు డైరెక్టరు, అటువంటి నవ్వు కాదు. ఆత్మ యొక్క నవ్వు. గురువు మిమ్మల్ని చూస్తున్నాడు అనుకోండి, అది మామూలు చూపు కాదు, ఆత్మ యొక్క చూపు. మామూలు మాంసపు నేత్రాలకి సంబంధించిన చూపు కాదు. మాంసపు నేత్రాలలో ఏముంది? అంతా తానైన చూపు! తననే తాను ఇతరులలో చూసుకుంటూ ఉంటాడు. గురువు చూపు అది. ప్రతి జన్మలో నీ కూడా ఉంటాడు. నీ లోపలే ఉంటాడు, అంతర్యామిగా ఉంటాడు. నీ ప్రాణానికి ప్రాణమై ఉంటాడు. నీ మనస్సుకి మనస్సై ఉంటాడు. నీ లోపలే అంతర్యామిగా ఉంటాడు. ఆయన సనాతనుడు. ఆయన

నిన్ను వెంటాడుతూనే ఉంటాడు, వెంటాడుతూ నిన్ను పక్వం చేసుకొంటూ వస్తాడు. ఆజన్మకాజన్మ నిన్ను ముగ్గేసుకుంటూ వస్తూ ఉంటాడు. కబీరుదాసు అన్నాడు "ఎన్నో జన్మలు కావాలా? నీ భర్తను ప్రేమించినట్టు నువ్వు భగవంతుడిని ప్రేమించు. ఈ జన్మలోనే నువ్వు తరిస్తావు. ఎవడివల్ల అయితే మనకి అన్నీ తెలియబడతాయో, ఆత్మజ్ఞానం వస్తుందో వాడే గురువు. ఎవడి అనుగ్రహం వల్ల అయితే మనకి అన్నీ తెలియబడతాయో, ఆత్మజ్ఞానం కూడా వస్తుందో వాడే గురువు." 'అడుగకిచ్చెడు నీదు అకళంకమగు కీర్తి హానిసేయక బ్రోవుమరుణాచలా' అసలు మనము భగవంతుడిని ఏమీ అడగకూడదు. అడగకుండా ఉండలేకపోతున్నాము. భగవంతుడిని ఇది కావాలని అడగటం, అది కూడా భక్తే. కానీ అడగటం అనవసరం అసలు. మన గురించి మనకంటే ఎక్కువగా మన గురువుకి తెలుసు, భగవంతుడికి తెలుసు. జన్మాంతరంలో ఆ అనుబంధం లేకపోతే ఆ ప్రేమ ఆప్యాయత గురువు మీద కలుగదు. ఎవరి అనుగ్రహం వల్ల మనకి సకలమూ తెలియబడతాయో, చివరికి ఆత్మజ్ఞానం కూడా కలుగుతుందో, వాడే మన గురువు. మనకి ఎప్పుడైనా సుఖం వస్తుంది అనుకోండి, అది కూడా గురువు అనుగ్రహమే. ఎప్పుడైనా దుఃఖం వస్తుంది, దుఃఖం అంటే ఎవరికీ ఇష్టం ఉండదు. నాకు దుఃఖం రాకూడదు రాకూడదు అనుకుంటారు, కానీ గురువు దుఃఖాన్ని కూడా పంపిస్తాడు. ఒకటి మటుకు మీరు గుర్తుపెట్టుకోండి, నేను చెప్పే మాటలు మీకు ఇష్టం ఉన్నా ఇష్టం లేకపోయినా మీకు నచ్చినా నచ్చకపోయినా ఇది వ్యాపారం కాదు. ఊరికే ఈ మాటలు మీ ముందు ఉంచి వదిలేస్తాను. మీరు ఊసేసినా లోపలికి తీసుకున్నా, యాక్సెప్ట్ చేసినా రిజెక్ట్ చేసినా. ఊరికే అలా భగవంతుడి మాట మీముందు ఉంచుతాను, మీరు అంగీకరించవచ్చు, అంగీకరించకపోవచ్చు. సుఖంలో కంటే, బాధలోనే కష్టంలోనే మనిషి తొందరగా పవిత్రుడు అవుతాడు. పది జన్మలలో సుఖం ద్వారా తెలుసుకొనేది ఒక జన్మలో దుఃఖం ద్వారా తెలుసుకుంటాడు. మీకు బాధ వచ్చింది అనుకోండి, సంసారికంగా ఏదోరకమైన బాధ వచ్చింది అనుకోండి, ఏ రకమైన బాధ వచ్చినా, గురువుకి తెలియకుండా ఆ బాధ రాలేదు మీకు. గురువుకి తెలియకుండా ఆ దుఃఖం రాలేదు. ఎందుకొచ్చింది అంటే అది, మీమీద కోపం కాదు, మిమ్మల్ని పవిత్రులని చెయ్యటానికి కావాలని పంపాడు ఆ దుఃఖాన్ని, వాడే గురువు.

రమణ సత్యం రమణ శివం రమణ సుందరం!

**శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805**

| | | |
|---|---|---|
| జనవరి | 17 | సద్గురు శ్రీనాన్నగారి ఆరాధన |
| జనవరి | 20 | అమలాపురం మాష్టారు ప్రవచనము |

**SRI RAMANA KSHETRAM** A/c. No. **510101006497273**
**Corporation Bank, Palakol Branch,** IFSC Code : **CORP0001613**

**ఆంధ్ర ఆశ్రమము, తిరువణ్ణామలై** ఫోన్ : 04175-236174
For Accomodation : Office Incharge Balaraju 08297672348, 9849124502

మీ 'రమణ భాస్కర' చందా గడువు ఆగష్టు నెలతో ముగిసింది. కావున రెన్యువల్ చందాను స్వయముగాగానీ, యం.ఓ ద్వారా గానీ కట్టవచ్చును. యం.ఓ చేయదలచిన వారు శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - 534 265 పేరున రు. 150/-లు పంపగలరు.

# 17-01-2019
# సద్గురు శ్రీ నాన్నగారి ఆరాధన

| | | |
|---|---|---|
| ఉదయం | గం॥ 6-00లకు | పారాయణం |
| | గం॥ 7-00లకు | అల్పాహారం |
| | గం॥ 9-00లకు | డా॥ ఉష గారి ప్రవచనము |
| | గం॥ 11-00లకు | అన్న ప్రసాదం |
| మధ్యాహ్నం | గం॥ 1-00లకు | E.O. పెద్దిరాజు గారి ప్రవచనము |

భక్తులందరూ రావలసినదిగా కోరుచున్నాము.

ఇట్లు

**భూపతిరాజు సూర్యనారాయణరాజు**

మరియు

**కుటుంబ సభ్యులు**

# వివేకం పాలించినచోట శాంతి పుష్కలంగా లభిస్తుంది

మన సాధన ఎంతవరకూ అందుబాటులోకి వచ్చింది అని నిరంతరం పరీక్షించుకోవాలి. కామం మనలను బాధిస్తున్నదా, కోపంతో మనం ఊగిపోతున్నామా? మన చిత్తశుద్ధి ఏమాత్రం ఉంది అని విచారణకావాలి. స్వప్నంలో చెడు సంకల్పాలు వస్తే మనం ఇంకా పూర్ణస్థితికి రాలేదని గుర్తుంచుకోవాలి. ఇది లేకపోతే జీవితం వ్యర్థం. మనోవృత్తులే మనలను మోసం చేస్తున్నాయి. ప్రకృతి మెరుపులను మనముందు పడేసి స్వామి మనలను ఆశాపాశులను చేసి ఏమి నొల్లుకొంటున్నాడో అని వేడుకగా చూస్తు ఉంటాడు. ఈ విషయాలు సాధకుడు గ్రహించి వివేకం పెంచుకొని శాంతి స్థానానికై ప్రయత్నం చెయ్యాలి. బాపూ "మనిషి జీవించి ఉన్నంతకాలం కామ వాంఛ (అంటే కోరికలు అనుభవించాలి అనే వాంఛ) పోదు. ఎంతోకొంత మిగిలి ఉంటుంది. అయితే అవగాహన కారణంగా అది తల ఎత్తదు" అన్నారు. గురు ప్రసాదం వల్ల సుఖదుఃఖాలను సమానంగా చూచేవాడికి శాంతి లభిస్తుంది. మనం శకునాలను, మంచి తిథులను లెక్క పెట్టుకొంటాము. ఉంగరం రాళ్ళలో రాళ్ళను చూచుకొంటాము. కానీ పరాత్పరుడు వీటికన్నిటికీ అతీతుడు అన్న సంగతి గుర్తించము. కర్మగతి మార్చ రానిది చిరిగిపోదు, మాసిపోదు. మనం దైవం ముందు గట్టిగా ఏడిస్తే వాయిదా వేస్తాడు అంతే. దీనిపై శ్రీనాన్నగారు "నేరారోపణగా కోర్టుకు వెళ్ళవసినది ఉంది బోను ఎక్కాలి. కానీ మన న్యాయవాది జడ్జి దగ్గర నా క్లయింట్ హాస్పిటల్‌లో ఉన్నాడు అని ఒక అర్జీ పెట్టుకొంటే ఆ ఆధారాలు నిజమైతే న్యాయాధిపతి కేసును వాయిదా వేస్తాడు నేరం రుజువైతే శిక్ష తప్పదు" అన్నారు. మన దుఃఖాలకు గతంలో మనం నడిచిన తప్పడు దారే కారణం. ఈ సత్యం మనకు అర్థమైతే సగం దుఃఖం అకస్మాత్తుగా మాయమైపోతుంది. మనతో వచ్చిన శరీరం మనకు తోడుగా ఉండదు. ప్రస్తుతం తోడుగా ఉన్న కుటుంబ సభ్యులు, స్నేహితులు మనలను గాఢంగా ప్రేమించేవాళ్ళు అందరూ దేహంలోంచి ఆత్మ ఎగిరిపోయినప్పడు మనలను నిప్పల్లో పడేసి వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోయి శరీర శుద్ధి చేసుకొంటారు. జీవితాన్ని అర్థం చేసుకోవటం అత్యవసరం అదే ముఖ్యం అని మనస్సుకు అర్థం కావటం లేదు అయితే జీవితంలో కొంత నటన అవసరం లేకపోతే జీవితం సాఫీగా సాగదు. మనస్సుకు సిద్ధాంతాల మీద నమ్మకం ఉంటుంది. జ్ఞాపకాల ద్వారా చూచే అలవాట్లు మానుకోవాలి. ధ్యానమంటే ఊరికే ఉండటం. ఏ ఆలోచనా లేకుండా ఏ ఉద్వేగాలు, అనుభూతులు లేకుండా మనం ఉన్నాము అంతే ఇది చాలా అద్భుతం. ఈ నిశ్చయాత్మకమైన అవగాహనతో కూడిన సంసిద్ధతే జ్ఞానం. శరీర, ప్రాణ, మనస్సులతో తాదాత్మ్య స్థితే జీవాత్మ. "నమ్ము అని కాక చూడు నేను చూస్తున్నాను నువ్వు చూడగలవు" అని అనుభవజ్ఞులు నొక్కివక్కాణిస్తున్నారు. దాన్ని మనం వినియోగించుకొంటే మనకు ఆ దర్శనభాగ్యం కలుగుతుంది. భగవాన్ "ఈ అబద్ధాలకు బెంగలు కూడా ఎందుకు" అన్నారు. జీవితం అబద్ధం. ఆత్మే సత్యం అని విజయం వల్ల వైరం, అపజయం వల్ల దుఃఖం కలుగుతుంది. ఈ రెంటికీ దూరమైనవాడు ప్రశాంతంగా సుఖంగా ఉంటాడు. వివేకం లోపించినప్పడు వేమన "నీతి హీనుని దగ్గరకు నిర్భాగ్యులు చేరుదురు" అన్నారు. బాధ అందమైనదే దాని సౌందర్యం దానికి ఉంది. అయితే బాధను కోరుకోకూడదు.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**